


వివరాలు మెయిన్‌లో

## గీతా కార్మికుల సమస్యలపై ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం వీడాలి

ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 27 అక్టోబరు , 2026 | పేజీలు : 6

# అర్ధరాత్రి గర్భిణీ ప్రసవ వేదన

**అందుబాటులో లేని డాక్టర్, ఎఎన్ఎం..!**
**సొంత ఖర్చులతో ఆటో సమకూర్చిన ఆశా కార్యకర్త**
**కందిబండ ఎఎన్ఎం లక్ష్మి చొరవతో సురక్షిత ప్రసవం**
**మేళ్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రి నిర్లక్ష్యంపై ప్రజల అగ్రహం**

**ప్రజాపక్షం/మేళ్లచెరువు :** గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం అందిస్తున్నామన్న ప్రభుత్వాల ప్రకటనలు క్షేత్రస్థాయిలో నీటిమూటలుగానే మిగులుతున్నాయి. అర్ధరాత్రి వేళ ఒక గర్భిణీ పురిటి నొప్పులతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ హాస్పిటల్‌కు తీసుకు వస్తే కాపాడాల్సిన స్థానిక ఆసుప్రతి వైద్యులు అందుబాటులో లేకపోవడం తీవ్ర కలకలం రేపుతుంది. విధుల్లో ఉండాల్సిన డాక్టర్‌తోపాటు కనీసం ఏఎన్ఎం కూడా అందుబాటులో లేకపోవడం స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అర్ధరాత్రి వేళ అమానుషం...**

మేళ్లచెరువు గ్రామానికి చెందిన కళ్లెం వెంకటమ్మ భర్త చిరంజీవి నిరుపేద దంపతులు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో వెంకటమ్మకు అకస్మాత్తుగా తీవ్రమైన పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. సమయం గడుస్తున్న కొద్ది నొప్పులు భరించలేక ఆమె నరకయాతన అనుభవించింది. ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లే ఆర్థిక స్తోమత లేకపోవడంతో, తీవ్ర నిరాశలో ఉన్న భర్త చిరంజీవి స్థానిక ఆశా కార్యకర్త ఝాన్సీకి సమాచారం అందించారు. బాధితురాలి దుస్థితిని చూసి చలించిపోయిన ఝాన్సీ వెంటనే సహాయక చర్యలకు ఉపక్రమించారు.

**మానవత్వం చాటుకున్న ఏఎన్ఎం లక్ష్మి ...**

ఆసుపత్రిలో ఘోర పరిస్థితి స్థానిక ఏఎన్ఎం అందుబాటులో లేకపోవడంతో ఆశా కార్యకర్త ఝాన్సీ నిరాశ చెందకుండా కందిబండకు చెందిన ఏఎన్ఎం లక్ష్మిని సంప్రదించారు. సమాచారం అందిన వెంటనే లక్ష్మి మానవత్వంతో స్పందించి వెంటనే వెంకటమ్మ వద్దకు





చేరుకున్నారు. పరిస్థితిని గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఆశా కార్యకర్త ఝాన్సీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన సొంత డబ్బులతో ఆటోను సమకూర్చి బాధితురాలిని మేళ్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. అందుబాటులో వైద్యాధికారి లేరు. ఆ క్లిష్ట సమయంలో రోగి సమస్యను వినడానికి కూడా వైద్యాధికారి లేకపోవడం విస్మయానికి గురిచేసింది. చివరకు వేరే మార్గం లేక ఏఎన్ఎం లక్ష్మి తన అనుభవంతో చొరవ తీసుకుని ఆసుపత్రిలోనే వెంకటమ్మకు కాన్పు చేశారు.

**రెఫరల్స్ పేరిట నరకయాతన...**

ప్రసవం ముగిసినా ఆ నిరుపేద కుటుంబానికి కష్టాలు తీరలేదు. పుట్టిన పాపాయి తక్కువ బరువుతో జన్మించడంతో శిశువు ఆరోగ్యం క్షిణించింది. మెరుగైన వైద్యం కోసం శిశువును తక్షణమే హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. కానీ అక్కడ కూడా కనీస సదుపాయాలు లేకపోవడంతో సూర్యాపేట జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. సూర్యాపేట జిల్లా ఆసుపత్రి వైద్యులు సైతం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని చేతులు దులుపుకున్నారు.

**దిక్కుతోచని స్థితిలో నిరుపేద కుటుంబం....**
**స్పందించిన యంత్రాంగం**

మేళ్లచెరువు లోకల్ ఆసుపత్రికి రావడానికే ఆటో చార్జీలు లేని ఆ నిరుపేద కుటుంబం, వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌కు ఎలా వెళ్లాలో తెలియక, చేతిలో పైసా లేక జిల్లా ఆసుపత్రి ఆవరణలోనే కన్నీరు మున్నీరుగా రోదించింది. వెంకటమ్మ భర్త ఆవేదనను అర్థం చేసుకున్న ఆశా కార్యకర్త ఝాన్సీ వెంటనే హెల్త్ సూపర్‌వైజర్లకు ఫోన్‌చేసి పరిస్థితి తీవ్రతను వివరించారు. ఈ క్రమంలో వైద్యాధికారులపై ఒత్తిడి పెరగడంతో ఉన్నతాధికారులు స్పందించారు. పై అధికారుల ఆదేశాలతో స్థానిక వైద్య సిబ్బంది కదిలి, శిశువుకు తగిన అత్యవసర చికిత్స అందించి ప్రాణాపాయం తప్పించారు. ఇంత జరుగుతున్నా మేళ్లచెరువు ప్రభుత్వ హాస్పటల్లో విధులు నిర్వహించే డాక్టర్ సమస్య గురించి తెలుసుకోకపోవడం గమనార్హం.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్...**

మండల కేంద్రమైన మేళ్లచెరువులో స్థానిక ఏఎన్ఎం, డ్యూటీ డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో లేకపోతే పేదల ప్రాణాలకు పూచి ఏవరిని నిలదీస్తున్నారు. ఏఎన్ఎం లక్ష్మి , ఆశా కార్యకర్త ఝాన్సీ సమయస్ఫూర్తితో, మానవత్వంతో వ్యవహరించడం వల్లే ప్రాణాపాయం తప్పిందని, లేదంటే ఘోరం జరిగిపోయేదని స్థానికులు మండిపడుతున్నారు. విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించిన మేళ్లచెరువు ఆసుపత్రి సిబ్బందిపై తక్షణమే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నాణ్యత ప్రమాణాలతో ధాన్యం తేవాలి

**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేయర్‌తో కలిసి ప్రారంభించిన కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**ప్రజాపక్షం/నల్లగొండ:** ఖరీఫ్‌లో ధాన్యం పండించిన రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందేందుకు నాణ్యత ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సూచించారు.ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల వైపు వెళితే గిట్టుబాటు ధరతో పాటు అధిక లాభాలు పొందవచ్చని అన్నారు.సోమవారం జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2026 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్‌లో గ్రేడ్ఏ ధాన్యానికి రూ.2,461, కామన్ రకానికి రూ.2,441 మద్దతు ధర ప్రకటించిందని, సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు.రైతులు తాలు, చెత్త, మట్టి పెళ్లలు, దుమ్ము లేకుండా,17 శాతం లోపు తేమతో నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలన్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో సన్న, దొడ్డు రకాలు కలిపి 6 లక్షల 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశామన్నారు. ధాన్య సేకరణకు జిల్లాలో 399 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రతి కేంద్రంలో వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించి సన్న ధాన్యం వెరైటీలను విశ్లేషించాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించామన్నారు.మార్కెట్‌లో సన్న రకానికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో మిల్లర్లు నేరుగా పొలాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారని, దొడ్డు ధాన్యానికి డిమాండ్



తక్కువగా ఉందని తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో రైతు వేదికల్లో రైతు నేస్తం ద్వారా అవగాహన కల్పిస్తామని,రైతులు హాజరు కావాలని కోరారు.మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... గత ఖరీఫ్ మాదిరిగానే ఈ ఖరీఫ్‌లోనూ ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని, సన్న ధాన్యాల్లో 7 వెరైటీలకు బోనస్ ఇస్తుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు, ఆదర్శ రైతు రామిరెడ్డి, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా సహకార అధికారి మమత, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ హైమావతి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు వారంలోగా పరిష్కరించాలి :**

పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులన్నింటినీ వారంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా అధికారులతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు.జిల్లా స్థాయితో పాటు మండల స్థాయి వరకు పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.ప్రతి వాన చుక్కను ఒడిసిపట్టాలి ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, మండల ప్రత్యేక అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. నవంబర్ నెలలో టీజీపీఎస్సీ పరీక్షల సక్రమ నిర్వహణతో పాటు తాగునీరు, ప్రత్యామ్నాయ పంటల అంశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.సోమవారం ప్రజావాణికి రెవెన్యూ శాఖకు 64, ఇతర శాఖలకు 51, మొత్తం 115 దరఖాస్తులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్‌డిఏ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రశాంతంగా ముగిసిన టీజీపీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24,26 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాల పరీక్ష కేంద్రంలో నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.శనివారం అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ (గ్రేడ్2) పరీక్షలు,సోమవారం అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పరీక్ష నిర్వహించారు.సోమవారం నిర్వహించిన అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పరీక్షకు ఉదయం 180 మందికి గాను 125 మంది, మధ్యాహ్నం 124 మంది అభ్యర్థులు హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఉదయం ఎస్పిఆర్ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. పరీక్ష రాస్తున్న కేంద్రంలోకి వెళ్లి ఏర్పాట్లు,కేటాయించిన అభ్యర్థులు, హాజరు వివరాలను జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు.



## ఓటు నమోదుకు ప్రాధాన్యతనివ్వండి

**ప్రజాపక్షం/చిట్యాల:** అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఎంఎల్‌సి ఓటును నమోదుకు ప్రాధాన్యతనివ్వాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి తుటపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని ఒక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి అందులో పనిచేస్తున్న పట్టభద్రులను కలిసి ఓటు నమోదు గురించి తెలియజేశారు. నవంబర్ 6 ఓటు నమోదుకు చివరి తేది అని, ఈ లోపు అందరూ ఓటు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పద్ధతిని కాపాడాలని సూచించారు. తమ ఓటు విలువను గుర్తించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు గుండాల నరేష్, నాయకులు మైల నర్సింహ్మా, పీకె వెంకన్న, గంజి గోవర్ధన్, గోశిక వెంకటేశం, కంచర్ల శంకర్ రెడ్డి, మల్లేష్, వైరాల రాహుల్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తాం

**ప్రజాపక్షం/చిట్యాల:** తెలంగాణ ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి ఇచ్చిన పిలుపుతో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘానికి ఎలాంటి సంభందంలేదని ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూనూరు సంజయ్‌దాస్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రభుత్వంతో చర్చించడం ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటామే గాని, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు తమ సంఘం చేపట్టదని పేర్కొన్నారు. తమ సంఘానికి చెందిన నాయకులు మంద వేణుగోపాల్‌రెడ్డి, జోగు లింగస్వామిలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడాన్ని ఆయన ఈ సందర్భంగా ఖండించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తున్న పూర్తి విశ్వాసం తమకు ఉందన్నారు. ఈ విషయం పట్ల ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని సంజయ్‌దాస్ పేర్కొన్నారు.

## ఇంకుడు గుంతలపై ఇంటింటా అవగాహన

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఉండాలని సూచిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాపాతం నమోదు అయినందున తాగు నీరు, సాగు నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు వారి వారి ఇండ్ల ముందు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం వలన రాబోయే వర్షాకాల సీజన్‌లో వర్షపు నీటిని వృదా చేయకుండా ఒడిసిపట్టుకోవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాలదాస్ యాదగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# జ్ఞానంతోనే మనిషి జీవితంలో మార్పు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జ్ఞానంతోనే మనిషి జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సోమవారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. సాధారణ జీవితం నుంచి ఉన్నత స్థాయికి ఎదగడానికి జ్ఞానం ఎంతో అవసరమన్నారు. జ్ఞానాన్ని సంపాదించడంతోపాటు దానిని ఆచరణలో పెట్టినప్పుడే వ్యక్తిగతంగా, సామాజికంగా మార్పు సాధ్యమవుతుందన్నారు. మనలో మార్పు వస్తే సమాజంలో మార్పు వస్తుందన్నారు. మహర్షి వాల్మీకి జీవితం నుంచి కరుణ, దయ వంటి గొప్ప విలువలను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, బిసి వెల్ఫేర్ అధికారి విశాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెండెం వెంకటరమణ పాల్గొన్నారు.

# నీరు, విద్యుత్, వృథాపై ఎంఆర్‌పిఎస్ వినతి




**ప్రజాపక్షం/గరిడేపల్లి :** గ్రామంలో మిషన్ భగీరథ నీరు, విద్యుత్ వృధా అవుతున్న అంశంపై ఎంఆర్‌పిఎస్ గరిడేపల్లి మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి ఎంపిడిఓకి, గ్రామ సర్పంచ్, కార్యదర్శికి గరిడేపల్లి యూత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర నీటి సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఒక్కరూ నీటిని, విద్యుత్‌ను పొదుపు చేయాలని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామంలో నీటి వృధాను అరికట్టాలని కోరుతూ, గ్రామంలో లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ పైపులకు మూతలు బిగించాలని, విరిగిన ట్యాప్‌లను మార్చాలని అన్నారు. పట్టపగలు కూడా బజారు, వీధి లైట్లు వెలుగుతూ విద్యుత్ వృధా అవుతోందని, వాటిని పగటిపూట ఆపివేసి విద్యుత్ ఆదా చేయాలని కోరారు. ప్రజల్లో నీటి పొదుపుపై చైతన్యం తీసుకురావాలని అవసరమైతే జరిమానాలు కూడా విధించాలని అన్నారు. ఎంపిపిఎస్ గరిడేపల్లి అంబేద్కర్‌నగర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని వారి కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు నకిరేకంటి రవి, ఆలంపల్లి శేఖర్, పిట్ట నాగార్జున, బుడిగ చక్రవర్తి, మచ్చ వేణు, వట్టెపు మధు, కొత్తపల్లి పవన్, మచ్చ ఆదాం, బచ్చలకూరి నాగార్జున పాల్గొన్నారు.

# రెడీ మిక్స్ ప్లాంట్ ఏర్పాటు విరమించుకోవాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న రెడీ మిక్స్ ప్లాంట్‌కు ఎలాంటి అనుమతులు మంజూరు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటి సభ్యులు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు సిపిఎం నాయకులు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జనావాసాలకు సమీపంలో ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్ నిర్వహణ సమయంలో వెలువడే దుమ్ము, ధూళి, వాహనాల రాకపోకల కారణంగా కలిగే కాలుష్యంయ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుందన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలను ఎదుర్కోవలిసి వస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అధికారులు చర్యలు తీసుకోవాలని నగేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెలికంటి నర్సింహ్మా, పంది నరేష్, గ్రామ శాఖ నాయకులు నాతి వెంకట్రామయ్య, అరూరి శంభయ్య, ఆడెపు రమేష్, అరూరి ప్రణీత్, గోలి సాయికిరణ్, సురకంటి పాపిరెడ్డి, నర్సిరెడ్డి, మేడి మనోజ్, మంకాల యాదయ్య, అరూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పంట అవసరాలకు అనుగుణంగా ఎరువులు వాడాలి




**ప్రజాపక్షం/చివ్వెంల :** మట్టి పరీక్ష ఫలితాల ఆధారంగా పంట అవసరాలకు అనుగుణంగా ఎరువులను సరైన మోతాదులో వాడాలని కెవికె గడ్డిపల్లి శాస్త్రవేత్త డి. ఆదర్శ్ అన్నారు. సోమవారం మండలంలోని దురాజ్‌పల్లి క్లస్టర్ పరిధిలోని తిరుమలగిరి రైతువేదికలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసారాన్ని పెంపొందించడం, మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత, పంట మార్పిడి వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. భూసారాన్ని కాపాడుకోవడానికి సేంద్రియ ఎరువులను వినియోగించాలని, మట్టి పరీక్ష కోసం శాస్త్రీయ పద్ధతిలో నమూనాలను సేకరించాలన్నారు. జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి నేలలో కలియదున్నడం ద్వారా సేంద్రియ పదార్థాలు పెరిగి, నేల నిర్మాణం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణ అధికారి డి. మానస, సర్పంచ్ కె. నాగయ్య, సూర్యాపేట మార్కెట్ కమిటి డైరెక్టర్ నరసింహా చారి తదితరులు పాల్గొన్నారు.



## వివాహా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో నెలకొని ఉన్న శ్రీశ్రీశ్రీ వేణుగోపాల స్వామి వారి కళ్యాణ వేడుకలు సోమవారం రోజున భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలలో ప్రభుత్వ విప్ వేముల వీరేశం పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వీరేశంకు ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు స్వాగతం పలికారు. స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, మేడి శ్రీలత, మాజీ సర్పంచ్ బుర్రి రవిందర్‌రెడ్డి, నాయకులు సాగర్ల నరేష్, జడల చిన్నమల్లయ్య, కాటం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను త్యాగం చేసి ఉద్యమించిన మలిదశ తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం విస్మరించిందని ఉద్యమకారుల జెఏసి జిల్లా నాయకుడు రామ్ సైదులు విమర్శించారు. సోమవారం పోలీస్‌లు వారిని స్టేషన్‌కు తరలించగా వారు నిరసన తెలిపి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించడానికి వెళ్తున్న ఉద్యమకారులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిడమర్తి అంజి, గుగులోతు నీలహేమ్లా నాయక్, అనంత చంద్రయ్య, నందిపాటి ప్రభాకర్, బచ్చలకూరి కోటయ్య, గుండు రమేష్, చింతమల్ల వరకుమార్, గుండు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మహాసభలు విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పురిటిగడ్డ నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు జరగనున్న అఖిలభారత రైతు సంఘం (ఏఐకెఎస్) 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి కోరారు. దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర చర్చ జరిపి, రైతుల హక్కుల సాధన కోసం భవిష్యత్ పోరాటాలకు మహాసభలు దిశానిర్దేశం చేయనున్నాయన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహా రెడ్డి భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు దేశంలోని 28 రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు మహాసభలకు హాజరు కానున్నట్లు తెలిపారు. నల్లగొండలో జరిగే సభలకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాగారపు పాండు, కొలిశెట్టి యాదగిరి రావు, మట్టిపెల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.





## ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం నాలుగు దరఖాస్తులు అందినట్లు ఎంపిఓ నాగరాజు తెలిపారు. ఈ నాలుగు దరఖాస్తులు హౌసింగ్‌కు సంబంధించినట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని అర్హత మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి నిరుపేద కుటుంబానికి పని కల్పించడమే లక్ష్యం



**ప్రజాపక్షం/మునగాల :** ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో గ్రామాల్లో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి పని కల్పించాలన్న లక్ష్యంతో విబిజిరాంజి పథకం ద్వారా పనిలేని నిరుపేద కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని నరసింహాపురం గ్రామ పంచాయితీలో విబిజిరాంజి పథకంలో భాగంగా గ్రామంలో ఫారం ఫాండ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 375 రకాల పనులను పథకం ద్వారా చేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడుగుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట నిర్మించుకోవాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీధర్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ ముత్తయ్య, రైతు ముదుంబై శేషాచార్యులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** వాల్మీకి జయంతి సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మహర్షి చిత్రపటానికి జిల్లా ఎస్‌పి కె. నరసింహ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవితం, ఆదర్శాలు, సమాజానికి ఆయన అందించిన విలువైన సందేశాలను స్మరించుకున్నారు. మహర్షి రచించిన రామాయణం, భారతీయ సంస్కృతి, నైతిక విలువలు, ధర్మం, సత్యనిష్టకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. వాల్మీకి మహర్షి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిఎస్‌పి నరసింహ చారి, ఇన్‌స్పెక్టర్లు రామారావు, శివకుమార్, రాజశేఖర్, నాగేశ్వరరావు, వెంకటయ్య, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.




## క్రీడారంగ వికాసానికి సమ్మిడి వీరారెడ్డి సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక క్రీడారంగ అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి సమ్మిడి వీరారెడ్డి అందించిన సేవలు ఎంతో చిరస్మరణీయమైనవని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో గల డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో స్థానిక క్రీడాకారులు, క్రీడాభిమానుల ఆధ్వర్యంలో సమ్మిడి వీరారెడ్డి జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సమ్మిడి వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రాంతీయ స్థాయిలో క్రీడల పురోగతికి, యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సమ్మిడి వీరారెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు.ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుకూరి బాలకృష్ణ, దేశిడి శేఖర్‌రెడ్డి, క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలో నల్గొండ బిసిలకు ప్రాధాన్యం ఇవ్వాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో వచ్చే నెలలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన బీసీ నాయకులకు తగిన అవకాశం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు కేవలం ఎన్నికల సమయంలో ఓటర్లుగానే మిగిలిపోతున్నారని, నిర్ణయాధికారం కలిగిన రాజకీయ పదవుల్లో మాత్రం తగిన ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారని పేర్కొన్నారు.గత ఎన్నికల్లో



ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు సమయంలో కూడా ఆర్థిక స్థోమత లేదనే సాకుతో బీసీలకు అవకాశాలు నిరాకరించారని విమర్శించారు. బీసీ వర్గాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా సామాజిక న్యాయం సాధించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

## విద్యార్థుల సమగ్ర వికాసానికి, విద్యకు అండగా ఉంటాం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేదరికం, ఆర్థిక ఇబ్బందులు ఏ ఒక్క విద్యార్థి ఉన్నత లక్ష్యాలకు, చదువుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో పేద విద్యార్థులను ప్రోత్సహించడం ఎంతో అవసరమని మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు తెలిపారు. సోమవారం మిర్యాలగూడ పట్టణం లోని 25వ వార్డుకు చెందిన జే మహేష్‌కుమార్ అనే విద్యార్థి శ్రీ చైతన్య కళాశాలలో చదువుతున్న సమయంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫీజు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు వెంటనే స్పందించి కళాశాల యాజమాన్యంతో మాట్లాడి ఫీజు మొత్తాన్ని తగ్గించడమే కాకుండా, మిగిలిన ఫీజును కూడా స్వయంగా చెల్లించి విద్యార్థికి ఆర్థికంగా అండగా నిలిచారు. ఆయన అందించిన ఆర్థిక సహకారంతో చదువును నిరంతరాయంగా కొనసాగించిన మహేష్‌కుమార్ ఇటీవల విడుదలైన ఫలితాల్లో మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించి ప్రతిభను చాటుకున్నాడు. ఈ సందర్భంగా వైద్యాధికారిగా ఎంపికైన మహేష్‌కుమార్‌ను మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు తన క్యాంప్ కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ శాసనసభ్యులు తిప్పన విజయసింహ రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎండి.ఇలియాస్‌ఖాన్, ఎంఎస్ స్టడీ సర్కిల్ బానావత్ కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులరైజేషన్ పూర్తయ్యే వరకు 100 శాతం వేతనం చెల్లించాలి

**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆధ్వర్యంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న 17 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు దీక్ష కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయడంతో పాటు 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్లు, 8 శాతం లాయల్టీ బోనస్, పీఆర్‌సి ప్రయోజనాలు అమలు చేయాలని




డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు మైక్రోబయాలజిస్ట్ ఆలకుంట్ల ఉపేందర్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ గాలి రాంబాబు,డాక్టర్ రమేష్,ఆడియాలజిస్టులు అనిల్, సంతోష్,డాక్టర్ వెంకటేశం,ల్యాబ్ టెక్నిషన్ సురేష్ ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



## ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 48వ వార్డులో ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రాన్ని సందర్శించి ఓటు నమోదు సరళిని పరిశీలించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైందన్నారు. ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించడంతోపాటు నమోదు ప్రక్రియలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకే ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మద్ధతు తెలిపి ఆయన విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోల నాగరాజు, ఈర్ల వాసు, ఉపేందర్, లింగరాజు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు చేయూత



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రానికి చెందిన పోలె శ్రీను,కత్తుల రాజేష్ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉండగా, విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ ఏవీ రెడ్డి ఆదివారం వారి కుటుంబాలను పరామర్శించారు.ఇరు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.అలాగే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న గాదె పాక కాశయ్య కుటుంబాన్ని కూడా పరామర్శించి రూ.10 వేల సాయం అందించారు. మొత్తం మూడు కుటుంబాలకు రూ.30 వేల ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.సాయం అందించినందుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి



**ప్రజాపక్షం/డిండి;** ఆరుతడి పంటలకు రైతులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి రెహానా సూచించారు. సోమవారం గుండ్లపల్లి మండలం రామంతాపూర్ గ్రామంలో రైతు కొండల్‌రెడ్డి పొలాన్ని సందర్శించారు. ఆ పొలంలో మినుములు, పెసర్లు, ఉలవలు వంటి పప్పు ధాన్యాల పంటలను సాగు చేస్తున్నారని తక్కువ నీటిని వినియోగంతో తక్కువ పెట్టుబడితో పప్పు ధాన్య పంటలను సాగు చేయడం పట్ల రైతు సంతృప్తి వ్యక్తం చేశారని ఆమె తెలిపారు. యాసంగిలో వరి పంట సాగు చేయకుండా దానికి బదులుగా ఆరుతడి పంటలైన శనగలు, మినుములు, పెసర్లు, జొన్నలు, వేరుశనగ వంటి పంటలను సాగు చేసుకోవాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, దీని వల్ల భవిష్యత్తులో తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఈవో సాయితేజ, రైతులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండలం నుండి హైదరాబాద్ సిఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి బయలుదేరనున్న బిఆర్ఎస్ మండల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో చింతలపాలెం గ్రామ సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి, నాయకులు మోర్తాల వెంకట్‌రెడ్డి, షేక్ మైబల్లి, మునగ లింగరాజు, కారింగుల కొండలు, జనగ గోపి, ,ఏక్ షాహెద్, బాణావత్ సైదా ఉన్నారు.



## సామాజిక తనిఖీ

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** గుడిబండ గ్రామంలో విబిజిరాంజి పథకంలో భాగంగా ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీల పనితీరును సూర్యాపేట జిల్లా జడ్పి సిఈఓ డి. శిరీష సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులకు హాజరయ్యే వారు అవసరమైన సామాగ్రిని వెంట తీసుకురావాలన్నారు. పథకంలో కేటాయించిన పనులకు అనుగుణంగా నిర్ధేశించిన విధంగా పని చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనుల నిర్వహణ, పెన్షన్ లబ్ధిదారుల వివరాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎంపిడిఓ ఇసాక్ హుస్సేన్, ఎంపిఓ రాంబాబు, గ్రామ కార్యదర్శి అవినాష్ రెడ్డి, గుడిబండ గ్రామ సర్పంచ్ మందల నాగయ్య, ఫీల్డ్ ఆఫీసర్ బిక్షం పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ




**ప్రజా పక్షం/నకిరేకల్:** జీవజాలం, వృక్షజాలం పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ప్రముఖ వృక్షశాస్త్రవేత్త, విశ్రాంత అధ్యాపకుడు టి. శంకరాచారి అన్నారు. బెల్లీస్ ఎడ్యుకేర్ సౌజన్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సు విభాగం ఆధ్వర్యంలో 'ప్రపంచ చరిత్రలో అక్టోబరు నెల' అంశంపై నిర్వహించిన ఉపన్యాసంలో ఆయన మాట్లాడారు.అక్టోబరు నెల ప్రత్యేకతలను వివరిస్తూ విద్యార్థులు ప్రపంచ పరిణామాలపై అవగాహన పెంచుకొని, సరైన కెరీర్ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ప్రిన్సిపల్ ప్రొఫసర్ బెల్లి యాదయ్య అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపల్ నాగు, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, డా. శ్రీనివాసాచారి, శ్రీనివాస్, హరిత, మధుసూదన్‌రెడ్డి, డా. శంకర్, నర్సింహాచారి, రవీందర్, ఉపేందర్, ఉదయ్‌కుమార్, మాధురి, సిబ్బంది వెంకన్న, వెంకట్‌రెడ్డి, సుదర్శన్, కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీట్‌లో సత్తా చాటిన సాత్విక

**ప్రజాపక్షం/నకిరేకల్:** నీట్ పరీక్షలో నకిరేకల్ మండలంలోని కడపర్తి గ్రామానికి చెందిన మూడ సాత్విక ప్రతిభ చాటారు. ఆల్ ఇండియా స్థాయిలో 1,14,960వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 1,676వ ర్యాంకు సాధించారు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహించిన తొలి విడత కౌన్సెలింగ్‌లో నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నారు. మూడ సైదులు కుమార్తె అయిన సాత్విక పట్టుదలతో చదివి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లో ఎంతో ప్రతిభ



**ప్రజాపక్షం/నాంపల్లి :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని,వారికి సరైన ప్రోత్సాహం లభిస్తే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేసే తత్వాన్ని అలవర్చుతాయని పేర్కొన్నారు.ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.పులికుంట్ల పీవీ యువసేన జట్టుకు నగదు రూ. 80వేలు, ద్వితీయ బహుమతిని సాధించిన దేవత్‌పల్లి గ్రీన్ ఆర్మీ జట్టుకు రూ.50వేలు నగదు బహుమతి,షిల్డ్ అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో నాంపల్లి పట్టణ సర్పంచ్ నక్క చంద్రశేఖర్,క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, యువకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభ్యున్నతికి సొసైటీ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** గ్రామీణ ప్రాంత పేద ప్రజల అభ్యున్నతికై రక్షణ వెల్ఫేర్ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమని తెలంగాణ సమాచార హక్కు చట్టం కమీషనర్ దేశాల భూపాల్, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ చైర్మన్ యాతాకుల ప్రమోద్ అన్నారు. సోమవారం కోదాడలోని కొమరబండ వై జంక్షన్ వద్ద సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పేద కుటుంబాలకు చెందిన చిన్నపిల్లలకు మెరుగైన విద్య అందించే లక్ష్యంగా గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం విద్యార్థులను ప్రోత్సహించడం, మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడడం వంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపకరిస్తాయన్నారు. రైతులకు సంబంధించిన కార్యక్రమాల ద్వారా రైతుల అభివృద్ధికి కృషి చేయడం ప్రశంసనీయమన్నారు. సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారకుడు రవి, రక్షణ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ పి. సుజాత, చిమిర్యాల సర్పంచ్ కొత్త గురవయ్య, గుడిబండ సర్పంచ్ మందుల నాగయ్య, రెడ్లకుంట సర్పంచ్ కుటుంబ రావు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవకుడికి అరుదైన గౌరవం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గత 30 సంవత్సరాలుగా పేద ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్‌కు అరుదైన గౌరవం లభించింది. సోమవారం మిర్యాలగూడ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ కోల సైదులుముదిరాజ్ ఆయన సేవా కార్యక్రమాలను గుర్తించి లయన్స్ క్లబ్ ప్రతిష్ఠాత్మక సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ మునీర్ అహ్మద్‌షరీఫ్ మాట్లాడుతూ తల్లిదండ్రుల స్ఫూర్తితోనే తాను గత 30 ఏళ్లుగా వైద్య రంగా నికి, సమాజానికి తగిన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.




లయన్స్ క్లబ్ వంటి అంతర్జాతీయ సేవా సంస్థ తమపై నమ్మకంతో ఇచ్చిన ఈ గుర్తింపు ఎంతో బాధ్యతాయుతమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, స్థానిక ప్రముఖులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటరు నమోదు సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగమైన ఓటరు నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా వేగవంతం చేసి విజయవంతం చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు తెలిపారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు సన్నాహక సమావేశంతో పాటు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని నందిపహాడ్ ప్రాంతంలో గల టీఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు తిప్పన విజయసింహ రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఎండి యూసుఫ్, ఎండి మోశిన్ అలీ, దుర్గంపూడి నారాయణ రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ధనావత్ చిట్టిబాబు నాయక్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, మట్టపల్లి సైదులు యాదవ్, పాలుట్ల బాబయ్య, ధనావత్ బాలాజీ నాయక్, అంగోతు హతిరాం నాయక్, వేలిచేటి రామకృష్ణ, ఎండి ఇలియాస్ ఖాన్, ఎండి మగ్దూం పాషా, మాజీద్, యర్రమల్ల దినేష్, పిసికె ప్రసాద్, నిమ్మల నవీన్ రెడ్డి, పద్మశెట్టి కోటేశ్వర రావు పాల్గొన్నారు.



## కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించి, ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా ఆదుకునేందుకు విజిబిరాంజి పథకం ఉపయోగపడుతుందని అదనపు డిఆర్‌డిఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం అర్వపల్లి గ్రామంలోని సీతారాంపురం హాబిటేషన్‌లో విబిజిరాంజి పథకం కింద గుట్టపై కందకాల తొవ్వకం పనులను ఆయన తనిఖీ చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గి పంటలు ఎండిపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రతి గ్రామంలో కూలీలందరికి సరిపడా పనులను గుర్తించి సిద్ధంగా ఉంచాలని సూచించారు. కూలీలు ఉదయం 8 గంటలకే పని ప్రదేశానికి చేరుకుని, నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేసి రోజుకు రూ.307కు తగ్గకుండా వేతనం పొందేలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఝాన్సీ, ఏపిఓ ఇరుగు నాగయ్య, టిఏ దీపిక, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి యాదవ్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/త్రిపురారం:** మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రామ్మూర్తి యాదవ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు ఆయన సేవలను స్మరించుకున్నారు.త్రిపురారం ప్రాంత అభివృద్ధికి, యాదవ సామాజిక వర్గ అభ్యున్నతికి రామ్మూర్తి యాదవ్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుండెబోయిన వెంకన్న యాదవ్, కోటేష్,నగేష్ యాదవ్,మాజీ మార్కెట్ చైర్మన్ కామర్ల జానయ్య,మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాసరెడ్డి, టీఆర్ఎస్ నాయకులు మడుపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/చండూరు:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పుల్లెంల గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీమతి అంజయ్య దశదిన కర్మ కార్యక్రమం నల్లగొండలోని చిన్న వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్లో సోమవారం జరిగింది. దశదిన కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు హాజరై మృతుడు శ్రీపతి అంజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 62వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన వారిలో పుల్లెంల సర్పంచ్ ముక్కాంల వెంకన్న 20వేలు , గుండ్రపల్లి సర్పంచ్ ఉజ్జిని ఉషఅనిల్ రావు 10వేలు , తుమ్మలపల్లి సర్పంచ్ బోయపల్లి రాజేష్ గౌడ్ 5వేలు , కొండాపురం సర్పంచ్ గిరి కరుణాకర్ 5వేలు తో పాటు మిగతా గ్రామాల సర్పంచ్ లు ఒక్కొక్కరు 2వేల రూపాయల ఆర్థిక సహాయం తో మొత్తం 62వేల రూపాయల నగదును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ బండారు యాదగిరి , ఎంపిఓ ఏరుకొండ కోటయ్య , మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షకార్యదర్శులు బోయపల్లి రాజేష్ , లేదన్న సత్యం, సర్పంచ్‌లు ముక్కాముల వెంకన్న, బోయపల్లి సునీతశ్రీనివాసులు , కొండ రజిత రవి, కావలి శివాని సురేష్ , దాసరి అలివేలుస్వామి , బొమ్మలసుగుణ శంకరయ్య పాల్గొన్నారు.



## ఇ-వేస్ట్ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మున్సిపాలిటీలో ఈనెల 28న ఈవేస్ట్ ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సపల్ కమీషనర్ డి అంజన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటలో తెలిపారు.ఇంటి పరిసర ప్రాంతాలలో,ఆఫీస్, ప్రభుత్వకార్యలయాలలో, పాఠశాలలో, ఇంట్లో వాడిన పడేసిన ఉపయోగంలేని ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్స్,టివి,ఫ్రిజ్,ఏసి,కంప్యూటర్,బ్యాటరీలు, కేబుల్స్,ఎలక్ట్రానిక్ సర్క్యూట్ బోర్డులు ఇతర ఈ వ్యర్థాలు ఉంటే ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కౌంటర్ లో అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

## జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైన పల్లవికి సన్మానం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారిణి మణిమద్దె పల్లవిని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని మహిళా సాధికారత కేంద్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి నరసింహ పల్లవిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త చైతన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ, ఫిజికల్ డైరెక్టర్ మీసాల కిరణ్, స్కూల్ అసిస్టెంట్ ప్రతాప్, పల్లవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండలంలోని తిమ్మాపురం గ్రామ జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన 1988/89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 37 సంవత్సరాల తర్వాత ఒకే చోట కలుసుకొని ఒకరినొకరు యోగక్షేమాలను తెలుసుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదివిన బడి పరిసరాలను చూసి బావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ చదువుతో ఈ రోజు వివిధ స్థాయిలో ఉన్నామని తెలిపారు. తమకు విద్యనందించిన గురువులు శ్రీనివాస్ రెడ్డి, స్వరాజ్యం, భాగ్యలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రం అన్ని రంగాల్లో భ్రష్టు

**ప్రజాపక్షం/కోదాడ :** మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో భ్రష్టు పట్టిపోయిందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదు పరిశీలకులు తిప్పన విజయసింహారెడ్డిలు విమర్శించారు. సోమవారం బిఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదుపై నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. ఉద్యోగ ఉపాధి రంగాల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. నిరుద్యోగులకు ఎన్నికలు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు అజయ్ కుమార్, టి రమేష్, కందిబండ సత్యనారాయణ, జానకి రామాచారి, కోల ఉపేందర్ పాల్గొన్నారు.



## ఉచిత కళ్లజోళ్ల పంపిణీ



**ప్రజాపక్షం/నల్లగొండ(నార్కట్‌పల్లి):** ఉద్దీపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో, పుష్పగిరి ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం మండలంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరయ్యారు.మండలంలోని పలు గ్రామాలలో కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కళ్లజోళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు కంటి వెలుగును అందించేందుకు ఉద్దీపన ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. కంటి పరీక్షల్లో సర్జరీ అవసరం ఉన్నవారిని గుర్తించి, వారికి ఉచితంగా సర్జరీలు చేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాయం శ్యామ్ సుందర్ రెడ్డి, అలుగుబెల్లి రవీందర్ రెడ్డి, నేతగాని కృష్ణయ్య, కిట్టు, జెరిపోతుల భరత్ గౌడ్, కొంపల్లి సైదులు, బాత్కా మహేష్, పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పాలకమండలి సభ్యులు,మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నైపుణ్యాలు, పరిశోధనలపై ఫార్మసీ విద్యార్థులు దృష్టి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బి.ఫార్మసీలో విద్యార్థులు విషయ పరిజ్ఞానంతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సూచించారు. విశ్వవిద్యాలయంలో తొలి బ్యాచ్ బి.ఫార్మసీ విద్యార్థుల కోసం సోమవారం నిర్వహించిన ప్రవేశ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.విద్యార్థులు ప్రారంభం నుంచే పరిశోధనల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని, ఔషధ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిద్ధం కావాలని ఉపకులపతి పిలుపునిచ్చారు.ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య అక్కినపల్లి రఘురాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి,ఫార్మసీ విభాగ అధిపతి డీన్ ఆచార్య వీ కిషన్,ఆడిట్ సెల్ డైరెక్టర్ ద వై ప్రశాంతి,సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వసంత,అర్చన,జి ఉపేందర్ రెడ్డి,హరీష్ కుమార్, రాంచందర్ గౌడ్,మాధురి, తదితర అధ్యాపకులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మానవత విలువలను చాటి చెప్పిన వాల్మీకి..



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహర్షి వాల్మీకి భారతీయ సంసృతి, సాహిత్య చరిత్రలో విశిష్టమైన స్థానం కలిగిన మహనీయుడని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ వారి సేవలను కొనియాడారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి భారతీయ సంసృతి, సాహిత్య చరిత్రలో విశిష్టమైన స్థానం కలిగిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్,ఏ.ఓ శివ ప్రసాద్,ఏ. ఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు,ఎస్‌బి సీఐ నాగరాజు, ఆర్.ఐలు సంతోష్, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ డేలో 45 ఫిర్యాదుల పరిశీలన

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ జిల్లా వ్యాప్తంగా వచ్చిన సుమారు 45 ఫిర్యాదులను పరిశీలించారు.వివిధ సమస్యలతో వచ్చిన బాధితులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

## సమాజ సేవకుడికి అరుదైన గౌరవం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గత 30 సంవత్సరాలుగా పేద ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్‌కు అరుదైన గౌరవం లభించింది. సోమవారం మిర్యాలగూడ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ కోల సైదులుముదిరాజ్ ఆయన సేవా కార్యక్రమాలను గుర్తించి లయన్స్ క్లబ్ ప్రతిష్ఠాత్మక సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ మునీర్ అహ్మద్‌షరీఫ్ మాట్లాడుతూ తల్లిదండ్రుల స్ఫూర్తితోనే తాను గత 30 ఏళ్లుగా వైద్య రంగా నికి, సమాజానికి తగిన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ వంటి అంతర్జాతీయ సేవా సంస్థ తమపై నమ్మకంతో ఇచ్చిన ఈ గుర్తింపు ఎంతో బాధ్యతాయుతమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, స్థానిక ప్రముఖులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదుకు ఫారం18 సమర్పించేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని, అర్హులైన పట్టభద్రులందరూ గడువులోగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్,ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి. చంద్రశేఖర్ కోరారు.సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి టి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్‌ఐఆర్ ప్రక్రియ, పట్టభద్రుల ఓటరు నమోదుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 12 జిల్లాల్లోని 192 మండలాల్లో నమోదు ప్రక్రియ కొనసాగు తోందని, దరఖాస్తుల పరిశీలనకు 249 మంది అధికారులను, 644 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు 3,26,669 దరఖాస్తులు వచ్చాయని, ఒరిజినల్ ధ్రువపత్రాలు పరిశీలించి అర్హత నిర్ధారిస్తున్నామని వెల్లడించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఎన్నికల సూపరింటెండెంట్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/మునగాల :** ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెస్ విద్యా సంస్థలు చైర్మన్ పందిరి నాగిరెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా కోదాడ పట్టణంలోని శ్రీసాయి వికాస్ డిగ్రీ, తేజ ఫార్మసీలలో 2023 వరకు డిగ్రీ, డిగ్రీ సమానమైన ఇతర కోర్సుల్లో ఉత్తీర్ణులై, ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అర్హత సాధించిన కళాశాల పూర్వ విద్యార్థుల సౌకర్యార్థం, కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓటు నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటేశ్వరరావు, కళాశాల సిఈఓ ఎస్‌ఎస్‌రావు, నాయకులు కొప్పుల జైపాల్‌రెడ్డి, ఉప్పుల జానకిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, కొమ్ము ఈదారావ్, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి ప్రకటోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రామాయణం వంటి మహాకావ్యాన్ని ప్రపంచానికి అందించిన ఆదికవి మహర్షి వాల్మీకి జీవితం, ఆయన బోధించిన ధర్మమార్గం నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని బొట్టుగూడ వాల్మీకి నగర్‌లో ఉన్న వాల్మీకి దేవాలయంలో ఆదికవి మహర్షి వాల్మీకి ప్రకటోత్సవ వేడుకలను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలోని మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి, ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి. రాంపాల్, బి. ఓంపాల్,సిహెచ్. అల్వేలా,సిహెచ్ పాండు,పి మురారి,పి. రవితో పాటు బస్తీ యువకులు,మహిళలు, భక్తులు పాల్గొన్నారు.





## ముమ్మరంగా గ్రాడ్యుయేషన్ నమోదు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** కెఎల్‌ఎన్ యువసేన, మిత్రమండలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎలక్షన్ ఓటరు నమోదు కార్యక్రమం గత మూడు రోజులుగా చేపడుతున్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ అర్హత కలిగిన పట్టభద్రులు, 2023 నవంబర్ లోపు డిగ్రీ అయిపోయిన వారందరు కూడా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు నమోదు చివరి రోజు వరకు తమ సేవలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారింగుల వినోద్ కుమార్ గౌడ్, అయిల వీరయ్య గౌడ్, బంటు బుచ్చి గౌడ్, ముత్తు వినో, ఆకుల వినోద్, కుక్కడపు మేఘాశ్యామ్ గౌడ్, బాలెబోయిన వివేక్ గౌడ్ పాల్గొన్నారు.

## ఎంజియులో యూత్ పార్లమెంట్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్, మై భారత్ నల్లగొండ ఆధ్వర్యంలో ఈనెల 31న నిర్వహించ తలపెట్టిన యూత్ పార్లమెంట్ పోస్టర్ను సోమవారం ఎంజియూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ విడుదల చేశారు. నల్లగొండ జిల్లా పరిధిలోని 18 నుండి 25 సంవత్సరాల మధ్య యువకులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని కోఆర్డినేటర్ మారం వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం జి యు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు

ప్రజాఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అం దించే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పం దించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలన్నారు. ప్రజలకు అవసరమైన సేవలు, తక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్‌మండలం తుఫ్రాన్‌పేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అనంతరం విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జయంత్‌కుమార్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీలక్ష్మి,పాఠశాల చైర్మన్ పి.సువర్ణ,ఉపాధ్యాయులు హరిత,అరుణ, రమేష్,దివిస్ ప్రతినిధులు బి.గోపి,జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# సన్నబియ్యం అక్రమ రవాణాపై విచారణకు ఆదేశం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని అక్రమంగా పక్కదారి పట్టిస్తే సహించేది లేదని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి తెలిపారు. దామరచర్ల మండలం తేట్టకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని రేషన్ డీలర్ ఆలంపల్లి చామంతి సన్నబియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని మంగల్ దుబ్బ తండాకు చెందిన ధీరావత్ శ్రీను నాయక్ సోమవారం మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయంలో నేరుగా వినతిపత్రం సమర్పించారు. తేట్టకుంట పరిధిలో సన్నబియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్థానిక గ్రామస్తులు గుర్తించి పట్టుకుని సంబంధిత అధికారులకు అప్పగించారని ఫిర్యాదుదారు తెలిపారు.పేదలకు చేరాల్సిన ఉచిత సన్నబియ్యం పక్కదారి పట్టడం వల్ల నిజమైన లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా గతంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తనకు ఓటు వేయలేదనే కక్షతో రేషన్ బియ్యం ఇవ్వనంటూ గ్రామస్తులతో దురుసుగా ప్రవర్తిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం అక్రమ తరలింపుపై అధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి వెంటనే ఈ వ్యవహారంపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సదరు రేషన్ డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధీరావత్ శ్రీను నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వెలవెలబోతున్న ప్రజావాణి..

### ఫిర్యాదుల కోసం అధికారుల ఎదురుచూపులు




**ప్రజాపక్షం/చిట్యాల:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో నల్లగొండ జిల్లా చిట్యాలలో కళ తప్పుతుంది. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉంటున్నప్పటికీ, ఫిర్యాదుదారులు మాత్రం ఆశించిన స్థాయిలో హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కేవలం ఆరు ఫిర్యాదులను మాత్రమే అధికారులు అందు కున్నారు. ప్రతి వారం ఇదే పరిస్థితి కనిపిస్తుండటంతో ప్రజావాణి కార్యక్రమం ఉద్దేశం నెరవేరుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణి ఒక వేదికగా ఉపయోగపడాలి. భూ సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు ఇతర స్థానిక సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించేందుకు ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన తక్కువగా ఉండటంతో అధికారులు ఫిర్యాదుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ప్రజలకు సమస్యలు లేవా?

ప్రజావాణికి ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరవుతుండటానికి కారణలేమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నిజంగానే ప్రజలకు సమస్యలు తగ్గిపోయాయా? లేక తమ సమస్యలను అధికారులకు విన్నవించినా పరిష్కారం లభించదనే భావనతో ప్రజలు వెనుకడుగు వేస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజావాణి కేవలం వినతులు స్వీకరించే కార్యక్రమంగా కాకుండా, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించే వేదికగా మారినప్పుడే దాని లక్ష్యం నెరవేరుతుంది. ప్రజల నుంచి వినతులు తక్కువగా రావడానికి గల కారణాలను అధికారులు విశ్లేషించి, ప్రజావాణిపై విశ్వాసం పెంచే చర్యలు చేపట్టేల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఇందిరమ్మ ఇళ్లు పేదోడి సొంతింటి కల



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ఇందిరమ్మ పేదోడి సొంతింటి కల సాకారమవుతుందనీ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.పోచంపల్లి పురపాలక,మండలంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులకు సోమవారం ఆయన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ పోచంపల్లి పురపాలక పరిధిలో రెండవ విడతగా 200 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు.ఇందిరమ్మ ఇల్లు పథకంతో ప్రతీ పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించుకునే అవకాశం వచ్చిందని దేశంలో మరెక్కడా లేనివిధంగా నిదులను మంజూరు చేస్తూ ప్రజల విశ్వాసం పొందుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ఘనతని అన్నారు.ఎంపిడివో కార్యాలయంలో 38 మంది లబ్దిదారులకు ఇళ్ళ మంజూరి పత్రాలను అందజేశారు. పోచంపల్లి ఆరోగ్య కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం తెలంగాణ డయాగ్నోస్టిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పరీక్షల కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆరోగ్యమే నిజమైన సంపద అని వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందేందుకు క్రమ తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవటం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నీటిని పొదుపుగా వినియోగించాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే కాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రజలు సహకరించాలని మండల తహశీల్దార్ వీరాబాయి.ఎంపిడిఓ శ్రీలత లు కోరారు.మండలంలోని గుండ్లబావి,పంతంగి,ఆరెగూడెం,కాట్రేవు గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావంపై సోమవారం గ్రామసభలు నిర్వహించారు. నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రైతులు నీటి ఆధారిత పంటలు కాకుండా ఆరుతడి పంటలను సాగు చేయాలన్నారు. రైతులు భూముల్లో ఖచ్చితంగా కుంటలను నిర్మాణం చేసుకోని నీటిని సంరక్షించాలని తెలిపారు.



## రైతులు దళారులను ఆశ్రయించొద్దు

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,సింగిల్‌విండో చైర్మన్ ఈద్దుల మస్తాన్‌బాబు యాదవ్ లు అన్నారు. చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం,మందోళ్ళగూడెం, ఎస్.లింగోటం,పంతంగి,నక్కలగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తాలు,మట్టిపెడ్డలు లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నాగార్జున,కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సురేష్,మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,సింగిల్‌విండో వైస్ చైర్మన్ పర్నె శివారెడ్డి,డైరెక్టర్లు లక్ష్మ మ్మ,రాజేందర్,వెంకట్‌రెడ్డి,నరేందర్‌రెడ్డి,స్వామి,మనోహర్ రెడ్డి,సుగుణమ్మ,శ్రీహరి పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** న్యాయవాదులు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐలు జిల్లా ఉపాధ్యక్షులు తడక మోహన్ డిమాండ్ చేశారు.చౌటుప్పల్ కోర్టు ఐలు ప్రథమ మహసభ సోమవారం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ కోర్టు కాంప్లెక్స్ నూతన భవన నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని కోరారు.జూనియర్ న్యాయవాదులకు రూ.10వేలు స్టైపాండ్ ఇవ్వాలని అన్నారు.న్యాయవాదులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.చౌటుప్పల్ కోర్టు ఐలు సంఘం గౌరవ అధ్యక్షులుగా ఉడుగు శ్రీనివాస్,అధ్యక్షులుగా జెల్లా రమేష్,ఉపాధ్యక్షులుగా పి.భరత్‌చంద్ర,ప్రధాన కార్యదర్శిగా ఎండి.ఖయ్యూంపాషా, సహాయ కార్యదర్శిగా పి.కిరణ్,కోశాధికారిగా చామట్ల జంగయ్య, కార్యవర్గ సభ్యులుగా అవ్వారు చేతన్,శంకర్,చంద్రబాబు లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా నిర్వహించే డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరూ సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి తెలిపారు. సోమవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కారమయ్యే సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 10 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డిఏఓ జె.శ్రీనివాస్ శర్మ, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.జగదీశ్వర్ రెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఆదినారాయణ, బిక్షం, జనార్ధన్, ఎండి అహ్మదుల్లా, ఉద్యానవన శాఖాధికారి నసీమా మెహ్రిన్, హెచ్డబ్ల్యూఓలు జానిమియా పాల్గొన్నారు.

